క్లుప్తంగా

నేడు రక్తదాన శిబిరం

జడ్చర్ల టౌన్: ప్రజాగాయకుడు సాయిచంద్ జయంతిని పురస్కరించుకొని శుక్రవారం పట్టణంలోని అంబేడ్కర్ కళా భవన్‌లో రెడ్‌క్రాస్ సొసైటీ సహకారంతో రక్తదాన శిబిరం ఏర్పాటు చేసినట్లు కాల్వ రాంరెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. రక్తదాన శిబిరానికి రజనీ సాయిచంద్ హాజరవుతారని.. సామాజిక వేత్తలు, కళాకారులు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని రక్తదాన శిబిరాన్ని విజయవంతం చేయాలని కోరారు.

పైప్‌లైన్ మరమ్మతు పూర్తి

జడ్చర్ల టౌన్: మున్సిపాలిటీలోని సిగ్నల్‌గడ్డపై 167వ నంబర్ జాతీయ రహదారిపై ధ్వంసమైన మిషన్ భగీరథ పైప్‌లైన్‌కు మరమ్మతు పనులను గురువారం పూర్తిచేశారు. కలెక్టర్ ఆదేశాల మేరకు సంబంధిత అధికారులు, కాంట్రాక్టర్ బుధవారం రాత్రి మరమ్మతు పనులు చేపట్టి తెల్లవారుజామున నీటి సరఫరాను పునరుద్ధరించారు. అయితే ఒక్కరోజు మాత్రమే నీటి సరఫరా అయ్యింది. నాగసాల నీటిశుద్ధి కేంద్రానికి మిషన్ భగీరథ నీటి సరఫరాను గురువారం నుంచి నిలిపివేశారు.

ఎయిడ్స్‌పై అవగాహన

అడ్డాకుల: హెచ్‌ఐవీ, ఎయిడ్స్ బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై గురువారం మండల కేంద్రంలో హోప్ ఎన్‌జీఓ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. రక్త మార్పిడి, తల్లి నుంచి బిడ్డకు, అసంరక్షిత లైంగిక సంపర్కం, నీడిల్స్ ద్వారా వ్యాధి వ్యాపిస్తుందని వివరించారు. ఈ సందర్భంగా కొందరికి పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో సుప్రియ, జ్యోతి పాల్గొన్నారు.

కాంస్య విజేతకు సన్మానం

మహబూబ్‌నగర్ క్రీడలు: ఇటీవల సరూర్‌నగర్ స్టేడియంలో జరిగిన రాష్ట్రస్థాయి యోగాసన పోటీల్లో జిల్లా కేంద్రానికి చెందిన కే.వెంకటేశ్ ప్రతిభ కనబరిచి మూడో స్థానంలో నిలిచి కాంస్య పతకాన్ని సాధించారు. ఈ సందర్భంగా గురువారం జిల్లా కేంద్రంలో వెంకటేశ్‌ను రాష్ట్ర ఫుట్‌బాల్ సంఘం ఉపాధ్యక్షుడు ఎన్‌పీ వెంకటేశ్ అభినందించి శాలువాతో సత్కరించారు.

బీఆర్‌ఎస్ నాయకుల అరెస్ట్

హన్వాడ: బీఆర్‌ఎస్ మండల నాయకులను గురువారం పోలీసులు ముందస్తు అరెస్ట్ చేశారు. రాష్ట్రవ్యాప్తంగా రుణమాఫీ కాని రైతుల పక్షాన బీఆర్‌ఎస్ హైదరాబాద్‌లోని ప్రగతి భవన్ ముట్టడికి పిలుపునిచ్చిన నేపథ్యంలో పోలీసులు బీఆర్‌ఎస్ శ్రేణులను అదుపులోకి తీసుకున్నారు. అరెస్టయిన వారిలో మాజీ ఎంపీపీ బాల్‌రాజు, జంబులయ్య, వెంకన్న, యాదయ్య, శివ, రాజు, శ్రీనివాసులు, కృష్ణ తదితరులు ఉన్నారు.

తాగునీటి సమస్యకు పరిష్కారం



మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: జిల్లా కేంద్రంలోని 2వ వార్డు ఏనుగొండ కాముడి చౌరస్తాలో తాగునీటి సమస్య పరిష్కారం కోసం ఏర్పాటు చేసిన పవర్ బోరును గురువారం మున్సిపల్ చైర్మన్ ఎ.ఆనంద్‌కుమార్‌గౌడ్ ప్రారంభించారు. కార్యక్రమంలో స్థానికులు సీహెచ్ వెంకటేశ్‌గౌడ్, సీహెచ్ మంజుల, మురళీధర్‌గౌడ్, కాంగ్రెస్ నాయకులు ఇమ్మడి పురుషోత్తం, ఎదిర శివశంకర్ పాల్గొన్నారు.

న్యాస్ మెటీరియల్ ఆవిష్కరణ

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: నేషనల్ అచీవ్‌మెంట్ సర్వే పరీక్షకు సంబంధించి సోషల్ ఫోరం ఆధ్వర్యంలో రూపొందించిన ప్రత్యేక మెటీరియల్‌ను గురువారం డీఈఓ రవీందర్ ఆవిష్కరించారు. ఏఎంఓ శ్రీనివాస్, సీఎంఓ బాలుయాదవ్, రతంగ్ పాణిరెడ్డి పాల్గొన్నారు.

ఆరోగ్య మిత్రలకు కనీస వేతనం ఇవ్వాలి



మహబూబ్‌నగర్ న్యూటౌన్: ఆరోగ్య మిత్రలకు కనీస వేతనం ఇవ్వాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి నల్లవెల్లి కురుమూర్తి డిమాండ్ చేశారు. గురువారం జిల్లా కేంద్రంలోని సీఐటీయూ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణ యునైటెడ్ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయీస్ యూనియన్ ఆధ్వర్యంలో ఆరోగ్య మిత్రలు చేస్తున్న సమ్మెకు సీఐటీయూ సంపూర్ణ మద్దతు తెలుపుతున్నట్లు పేర్కొన్నారు. రెండు రోజుల సమ్మెలో భాగంగా ప్లకార్డులతో నిరసన వ్యక్తం చేశారు. అనంతరం కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ మోహన్‌రావుకు వినతి పత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు విజయవర్ధన్‌రాజు, జిల్లా కార్యదర్శి గిరిప్రసాద్, చంద్రయ్య, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

పంటలు ఎండుతున్నాయ్..

- తెగిన కేఎల్ఐ కాల్వకు పూర్తికాని మరమ్మతు
- 15 రోజులుగా నీరు లేక ఎండుమొఖం పట్టిన వరిపంట



వాడ్యాల్ సమీపంలో నీరు లేక నెర్రలు బారిన వరిపొలం



వాడ్యాల్ వద్ద నీరు లేక వెలవెలబోతున్న కేఎల్ఐ కాల్వ

మిడ్జిల్: ఇటీవల కురిసిన భారీ వర్షాలకు ఎంజీకేఎల్ఐ కాల్వ కోతకు గురికావడం ఆయకట్టు రైతులకు శాపంగా మారింది. కాల్వ నీటిపైనే ఆధారపడి సాగుచేసిన పంటలు ఎండుమొఖం పడుతుండటంతో ఆందోళన చెందుతున్నారు. మిడ్జిల్ మండలం మీదుగా కల్వకుర్తి నియోజకవర్గం వరకు ప్రవహిస్తున్న కేఎల్ఐ కాల్వ ఈ నెల 2న మున్ననూర్ సమీపంలోని దుందుభీ వాగు వద్ద కోతకు గురైంది. కాల్వ నీరంతా దుందుభీ వాగు ద్వారా డిండికి చేరుతోంది. ఫలితంగా పంట పొలాలకు నీరందని పరిస్థితి ఏర్పడింది. కాల్వపై ఆధారపడి మిడ్జిల్ మండలంలో దాదాపు 2 వేల ఎకరాల్లో వరి, వేరుశనగ, పత్తి పంటలను సాగుచేశారు. ఓవైపు 15 రోజులుగా వర్షాలు లేకపోవడం.. మరోవైపు కాల్వ నీరు అందక పోవడంతో వరిపంట ఎండుమొఖం పడుతోంది. కొందరి రైతుల వరిచేను నెర్రలు బారింది.

ఆందోళనలో రైతులు..

కేఎల్ఐ కాల్వ నీటిపై ఆధారపడి చిల్వేర్, వెలుగొమ్ముల, అయ్యవారిపల్లి, మున్ననూర్, వాడ్యాల్, మిడ్జిల్, కొత్తూర్, మల్లాపూర్ గ్రామాల శివారులో రైతులు పంటలను సాగుచేశారు. అయితే పంటలను దృష్టిలో ఉంచుకొని కాల్వ మరమ్మతు పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి అధికారులకు సూచించారు. ఈ మేరకు నాలుగు రోజుల క్రితం కాల్వ తెగిన ప్రాంతంలో బండ్ ఏర్పాటుచేసి, నీటిని విడుదల చేయగా.. అదే రోజు రాత్రి తెగిపోయింది. ప్రస్తుతం కాల్వ మరమ్మతు పనులు నత్తనడకన సాగుతున్నాయి. కాల్వలో నీరు వస్తుండటంతో పనులకు ఆటంకంగా మారుతోందని అధికారులు చెబుతున్నారు. కాల్వకు మరమ్మతు పూర్తయి సాగునీరు ఎప్పుడు వస్తుందో తెలియక రైతులు ఆందోళన చెందుతున్నారు. కాల్వ మరమ్మతు పనులను త్వరగా పూర్తిచేయాలని రైతులు వేడుకుంటున్నారు.

త్వరగా పూర్తి చేయాలి..



కాల్వ నీటిని నమ్ముకొని నాకున్న ఎకరా పొలంతో పాటు మరో నాలుగెకరాలను కౌలుకు తీసుకొని వరిపంట సాగు చేశాను. 15 రోజులుగా నీరు లేకపోవడంతో పంట మొత్తం ఎండుమొఖం పట్టింది. అధికారులు స్పందించి కాల్వ మరమ్మతు పనులను త్వరగా పూర్తిచేయాలి.

– ఆంజనేయులు, రైతు, వాడ్యాల్

వరిచేను ఎండిపోతుంది..



కేఎల్ఐ కాల్వ కింద రెండెకరాల్లో వరి సాగు చేశాను. బోరు బావి లేదు. కాల్వ నీరే ఆధారం. 15 రోజుల నుంచి నీరు లేకపోవడంతో వరిచేను ఎండిపోతుంది. కాల్వకు త్వరగా మరమ్మతు చేసి, పంటలను కాపాడాలి.

– శ్రీనివాసులు, రైతు, మిడ్జిల్

నీరు వస్తుండటంతో పనులకు ఆటంకం..

కేఎల్ఐ కాల్వలో నీరు వస్తుండటంతో మరమ్మతు పనులకు ఆటంకం కలుగుతుంది. రెండు రోజుల క్రితం నీటి విడుదలను నిలిపివేసి.. బండ్ ఏర్పాటు చేశాం. రైతులకు ఇబ్బంది లేకుండా ఉండాలని నీరు విడుదల చేయగా.. దుందుభీ వాగు వద్ద సిమెంట్ కట్టలకు డ్యామేజీ అవుతుంది. అలాగే నీటి ఉధృతికి బండింగ్ తెగిపోవడంతో పనులు చేయడం ఇబ్బందిగా ఉంది. నీరు తగ్గిన వెంటనే మరమ్మతు పనులను పూర్తిచేస్తాం.

– పవన్, కేఎల్ఐ ఏఈ, మిడ్జిల్ మండలం

పంటల నమోదు పక్కాగా చేపట్టాలి



వీసీలో పాల్గొన్న డీఏఓ వెంకటేష్

రాజాపూర్: పంట వివరాల నమోదు పక్కాగా చేపట్టాలని డీఏఓ వెంకటేష్ అన్నారు. డిజిటల్ క్రాప్ సర్వేపై గురువారం హైదరాబాద్ నుంచి వ్యవసాయశాఖ కమిషనర్ వీసీ నిర్వహించగా.. రంగారెడ్డిగూడ రైతువేదిక నుంచి డీఏఓ పాల్గొన్నారు. అనంతరం వ్యవసాయశాఖ అధికారులు, సిబ్బందిని ఉద్దేశించి డీఏఓ మాట్లాడుతూ.. క్షేత్రస్థాయిలో పంటలను పరిశీలించి పూర్తి వివరాలను నమోదు చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఏఓ ప్రదీప్‌కుమార్‌గౌడ్, ఏఈఓలు దీపిక, శ్రీనివాస్, రమేష్ రెడ్డి, మహేష్ కుమార్ పాల్గొన్నారు.

ఘనంగా గణేశ్ నిమజ్జనం

నవాబుపేట: మండలంలోని తిమ్మయ్యపల్లిలో గురువారం గణనాథుడి నిమజ్జనోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ నర్సింహాచారి ప్రత్యేక పూజలు నిర్వహించి, గణనాథుడి శోభాయాత్రను ప్రారంభించారు. భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. శ్రీనివాసాచారి, మల్లేష్, రాములు, రఘువీర్ శర్మ, నిరంజన్ పాల్గొన్నారు.



పారిశుద్ధ్యంపై శ్రద్ధ పెట్టండి



పాఠశాల ఆవరణలో మొక్కలు నాటి నీరు పోస్తున్న మున్సిపల్ కమిషనర్ మహేశ్వర్‌రెడ్డి

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: పట్టణ పరిధిలో పారిశుద్ధ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని మున్సిపల్ కమిషనర్ డి.మహేశ్వర్‌రెడ్డి ఆదేశించారు. గురువారం ఉదయం తన చాంబర్‌లో శానిటేషన్ విభాగం అధికారులు, సిబ్బందితో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మెయిన్ రోడ్డుకు ఇరువైపులా ఫుట్‌పాత్‌పై ఎలాంటి ప్లాస్టిక్ వస్తువులు, వ్యర్థ పదార్థాలు పడేయకుండా చూడాలన్నారు. వివిధ వార్డులలో ఇప్పటికే పదుల సంఖ్యలో డెంగీ కేసులు నమోదవుతున్నాయని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకునేలా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఓపెన్ ప్లాట్లలో ఎవరూ చెత్తాచెదారం వేయకుండా తగు చర్యలు తీసుకోవాలన్నారు. వీటి యజమానుల వివరాలు సేకరించి నోటీసులు అందజేయాలన్నారు. ఇంటింటికీ వచ్చే స్వచ్ఛ ఆటోలకు తడి, పొడి చెత్తను వేరు చేసిన తర్వాతే ఇవ్వాలని ఆయన సూచించారు. అనంతరం 'స్వచ్ఛతాహీ సేవ'లో భాగంగా రెండోరోజు బండమీదిపల్లిలోని యూపీఎస్ ఆవరణలో మొక్కలు నాటి, పాదులలో మట్టితో పాటు నీరు పోశారు. వాటికి వెంటనే ట్రీగార్డులను ఏర్పాటు చేయించారు. అలాగే గతంలో నాటిన కోనోకార్పస్ మొక్కలను తొలగింపజేసి వేరే వాటిని ఏర్పాటు చేయించారు. కార్యక్రమాల్లో 13వ వార్డు కౌన్సిలర్ గజగౌని లక్ష్మీదేవి, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు గురులింగం, వజ్రకుమార్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి పాల్గొన్నారు.

అనుచిత వ్యాఖ్యలు చేస్తే సహించం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి

దేవరకద్ర/దేవరకద్ర రూరల్: దేశం కోసం ప్రాణాలు అర్పించిన రాజీవ్ గాంధీపై అనుచిత వ్యాఖ్యలు చేస్తే సహించేది లేదని ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి అన్నారు. బుధవారం కౌకుంట్ల రైతువేదికలో మహాలక్ష్మి పథకం లబ్ధిదారులకు ప్రొసిడింగ్స్ అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న మంచి పనులను విమర్శించడమే ధ్యేయంగా బీఆర్‌ఎస్ పని చేస్తుందన్నారు. కేటీఆర్, హరీష్‌రావులకు రాజీవ్ గాంధీని విమర్శించే స్థాయి లేదని.. బీజేపీ మెప్పు కోసమే రాజీవ్‌గాంధీ విగ్రహాన్ని తొలగిస్తామని మాట్లాడుతున్నారని ధ్వజమెత్తారు. గత ప్రభుత్వం విధ్వంసం చేసిన ఆర్థిక వ్యవస్థను కాంగ్రెస్ ప్రభుత్వం చక్కదిద్దుతూ.. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ఆరు గ్యారంటీలను అమలు చేస్తోందన్నారు. 98 శాతం మంది రైతులకు రుణమాఫీ చేశామని.. సాంకేతిక కారణాలతో రుణమాఫీ కాని రైతుల సమస్యను త్వరలోనే పరిష్కరిస్తామని తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఎల్లయ్య, ఎంపీడీఓ శ్రీనివాస్, ఏఓ శివకుమార్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రాఘవేందర్ రెడ్డి, మాజీ జెడ్పీటీసీ లక్ష్మీకాంత్ రెడ్డి, కిషన్‌రావు, మాజీ సర్పంచ్ స్వప్న పాల్గొన్నారు.

- మండలంలోని కోయిల్‌సాగర్ మాజీ సర్పంచ్ దివంగత కృష్ణారెడ్డి భార్య యశోదమ్మ ఇటీవల మృతిచెందింది. గురువారం నిర్వహించిన దశదిన కర్మలో ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి పాల్గొని ఆమె చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతరం యశోదమ్మ కుమారుడు నాగిరెడ్డిని పరామర్శించారు. ఎమ్మెల్యే వెంట టీపీసీసీ ఆర్గనైజింగ్ కార్యదర్శి అరవింద్‌రెడ్డి, లక్ష్మీకాంత్‌రెడ్డి, బాలస్వామి, గోవర్ధన్‌రెడ్డి, ఆది హన్మంత్‌రెడ్డి, ఫారూఖ్, రాంపాండు, గోవర్ధన్, వెంకటేశ్, గోపాల్ ఉన్నారు.

చెరువులను పరిరక్షించాలి



మాట్లాడుతున్న పెద్దయ్య యాదవ్

జడ్చర్ల టౌన్: రాష్ట్రవ్యాప్తంగా చెరువుల సంరక్షణకు ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్ల పరిధిలో ఆక్రమణలను తొలగించాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు పెద్దయ్య యాదవ్ ప్రభుత్వాన్ని కోరారు. గురువారం పట్టణంలోని బీసీ జాగృతిసేన కార్యాలయంలో నిర్వహించిన సంక్షేమ సంఘం ముఖ్యనాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. చెరువుల చుట్టూ బండరాళ్లతో హద్దులను ఏర్పాటుచేసి, మొక్కలు నాటాలన్నారు. అందుకు ఈజీఎస్ నిధులు వినియోగించాలని కోరారు. వెంచర్లలోనూ ప్రభుత్వ భూమి కబ్జాకు గురి కాకుండా పరిరక్షించాలన్నారు. కార్యక్రమంలో బీసీ జాగృతిసేన నాయకులు నిరంజన్, నర్సింహులు, గోపాల్, శేఖర్, భీంరాజ్, రాజ్, శివశంకర్, వెంకటేశ్, రాధాకృష్ణ, చెన్నకేశవులు, బాలు, శంకర్ ఉన్నారు.

ఓటరు జాబితాలో తప్పులను సరిచేసుకోవాలి



దేవరకద్రలో మాట్లాడుతున్న ఎంపీడీఓ శ్రీనివాసరావు

దేవరకద్ర/భూత్పూర్/నవాబుపేట: ముసాయిదా ఓటరు జాబితాలో ఏమైనా తప్పులు ఉంటే ఈ నెల 21వ తేదీలోగా సరిచేసుకోవాలని అధికారులు సూచించారు. గురువారం దేవరకద్ర, భూత్పూర్, నవాబుపేట మండల పరిషత్ కార్యాలయాల్లో రాజకీయ పార్టీల నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓలు శ్రీనివాసరావు, ప్రభాకరాచారి, జయరాం నాయక్ మాట్లాడుతూ.. అన్ని గ్రామపంచాయతీల్లో వార్డుల వారీగా ముసాయిదా ఓటరు జాబితాను అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. జాబితాలో ఓటరు పేరు, వివరాలను సరిచేసుకోవడంతో పాటు కుటుంబ సభ్యులందరి పేర్లు ఒకే వార్డు పరిధిలో ఉండేలా చూడాలని కోరారు. ఈ నెల 28న తుది ఓటరు జాబితాను విడుదల చేయనున్నట్లు తెలిపారు.

విజయోత్సవాలను జయప్రదం చేయండి



మాట్లాడుతున్న బాల్‌రాజు మాదిగ

హన్వాడ: ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు తీర్పును స్వాగతిస్తూ ఈ నెల 21న రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లా, మండల కేంద్రాలు, గ్రామాల్లో నిర్వహించ తలపెట్టిన విజయోత్సవాలను విజయవంతం చేయాలని టీఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.బాల్‌రాజు మాదిగ పిలుపునిచ్చారు. గురువారం మండలంలోని చిన్నదర్పల్లిలో ఎస్సీ, ఉపకులాల వారితో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణతో మాదిగ, ఉపకులాల సంక్షేమ, అభివృద్ధికి బాటలు పడనున్నాయని తెలిపారు. విజయోత్సవాల్లో అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సింగపాగ జంగయ్య, మధు, కొత్త నర్సింహులు, రామకృష్ణ, శ్రీకాంత్ ఉన్నారు.

'సుప్రీంకోర్టు తీర్పు అమలుపర్చాలి'

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): ఎస్సీ వర్గీకరణపై సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పును అమలుపర్చాలని తెలంగాణ ప్రజాఫ్రంట్ జిల్లా సమన్వయకర్త బిచ్చారెడ్డి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. రిజర్వేషన్ల హక్కుల అమలు కోసం జరిగే అన్ని రకాల పోరాటాలకు ప్రజా ఫ్రంట్ సంపూర్ణ మద్దతు ఇస్తుందని పేర్కొన్నారు.

స్వచ్ఛత అందరి బాధ్యత

నవాబుపేట: పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని ఎంపీడీఓ జయరాంనాయక్ అన్నారు. స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా గురువారం రుద్రారం, కొండాపూర్ గ్రామాల్లో శ్రమదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పారిశుద్ధ్య కార్యక్రమాల్లో అందరూ భాగస్వాములు కావాలని కోరారు.

సూక్ష్మజీవుల స్వరూపంపై రంగోళి



సూక్ష్మజీవుల స్వరూపంపై రంగోళి పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

జడ్చర్ల టౌన్: పట్టణంలోని బీఆర్‌ఆర్ ప్రభుత్వ డిగ్రీ, పీజీ కళాశాలలో గురువారం మైక్రోబయోలజీ విభాగం ఆధ్వర్యంలో సూక్ష్మజీవుల స్వరూపం అనే అంశంపై రంగవల్లుల పోటీలు నిర్వహించారు. సూక్ష్మజీవులు, వాటి ఆకృతి, నిర్మాణం యోగ్యత లోపాలపై విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు ఈ పోటీలు నిర్వహించినట్లు ప్రిన్సిపాల్ డా. సుకన్య తెలిపారు. పోటీలను విభాగాధిపతి డా. మాదురి పర్యవేక్షించగా.. న్యాయ నిర్ణేతలుగా సదాశివయ్య, డా.నాగలక్ష్మి, లత వ్యవహరించారు.

నూతన కమిటీ ఎన్నిక

గండీడ్: మండల కేంద్రంలో గురువారం పీఆర్టీయూ టీఎస్ మండల కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా శ్రీనివాస్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా కృష్ణయ్య, అసోసియేట్ అధ్యక్షుడిగా కొండయ్య, మహిళా విభాగం ఉపాధ్యక్షురాలిగా భవ్యశ్రీ, కార్యదర్శిగా కృష్ణారెడ్డి, మహిళా కార్యదర్శిగా మధుమతి ఎన్నికయ్యారు.

అన్నివర్గాల సంక్షేమమే లక్ష్యం



కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి

స్టేషన్ మహబూబ్‌నగర్/మహబూబ్‌నగర్ రూరల్: అన్ని వర్గాల సంక్షేమమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తోందని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో గురువారం హన్వాడ మండలానికి చెందిన 28 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. మహబూబ్‌నగర్ మండలం ఫతేపూర్‌లో రూ. 5 లక్షలతో నిర్మించిన సీసీరోడ్డు, భవానీ తండాలో రూ. 5 లక్షలతో నిర్మించిన సీసీరోడ్డు, రూ. 20 లక్షలతో నిర్మించిన గ్రామపంచాయతీ భవనాన్ని ప్రారంభించారు. అనంతరం గ్రంథాలయ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రాష్ట్రంలో ప్రజాపాలన కొనసాగుతోందన్నారు. పేదల సంక్షేమమే ధ్యేయంగా సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నట్లు తెలిపారు. రేషన్‌కార్డులు లేని వారి కోసం త్వరలోనే అధికారులు గ్రామాలకు వస్తారని.. వారికి పూర్తి వివరాలు తెలియజేయాలని సూచించారు. ప్రజా ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రతిపక్ష నాయకులు జీర్ణించుకోలేక విమర్శలు చేస్తున్నారని అన్నారు. కాగా, బీఆర్‌ఎస్ నాయకుడు గుండా మనోహర్ ఎమ్మెల్యే సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. కార్యక్రమాల్లో ప్రత్యేకాధికారి లక్ష్మణ్‌సింగ్, ఎంపీడీఓ కరుణశ్రీ, పీఆర్ ఏఈ టి.రాములు, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లు నర్సింహారెడ్డి, మాజీ సర్పంచ్ పాండు, నాయకులు ఎన్‌పీ.వెంకటేశ్, సురేందర్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, మహేందర్, నర్సింహారెడ్డి, నరేష్, భాస్కర్, గోవింద్ యాదవ్, సిరాజ్ ఖాద్రీ, లక్ష్మణ్ యాదవ్ పాల్గొన్నారు.

- ఆర్టీసీ రిటైర్డ్ ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని సీనియర్ సిటిజన్ ఫోరం కార్యాలయంలో నిర్వహించిన ఆర్టీసీ రిటైర్డ్ ఎంప్లాయిస్ యూనియన్ సమావేశానికి హాజరై మాట్లాడారు. గత ప్రభుత్వం ఆర్థిక వ్యవస్థను విధ్వంసం చేసినప్పటికీ ప్రజలకు ఇచ్చిన మాట ప్రకారం ఆరు గ్యారంటీలను అమలు చేస్తున్నట్లు చెప్పారు. సమావేశంలో రాజసింహుడు, జగపతిరావు, జీబీ.పాల్, ఉమేష్‌కుమార్, నారాయణ, నాగాంజనేయులు ఉన్నారు.

మైనర్లు వాహనాలు నడపొద్దు



అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ శ్రీనివాస్

అడ్డాకుల: మైనర్లు ఎట్టి పరిస్థితుల్లోనూ వాహనాలు నడపకూడదని ఎస్ఐ ఎం.శ్రీనివాస్ అన్నారు. ఎన్‌హెచ్ఏఐ సూచన మేరకు గురువారం రోడ్డు ప్రమాదాల నివారణపై టోల్‌ప్లాజా ప్రాజెక్టు మేనేజర్ దీపా మాడియా ఆధ్వర్యంలో అడ్డాకుల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో రెండో సంవత్సరం విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ.. విద్యార్థులు రోడ్డు దాటేటప్పుడు తప్పనిసరిగా నిబంధనలు పాటించాలని తెలిపారు. అతివేగంతో వాహనాలు నడిపే వారు ఎక్కువగా ప్రమాదాలకు గురవుతారని.. రహదారిపై పెట్రోల్ బంకులు, ఇతర ప్రాంతాల వద్ద రాంగ్‌రూట్లో వెళ్లి ప్రమాదాలకు గురికావొద్దని సూచించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ శివరామకృష్ణ, టోల్‌ప్లాజా ఆపరేషన్స్ మేనేజర్ సంతోష్ కుమార్, రూట్ ఆఫీసర్ తేజ స్వరూప్, సీఆర్‌ఓ అమీర్, ఆర్‌పీఓ కురుమూర్తి పాల్గొన్నారు.

చదువుతో పాటు క్రీడలు అవసరం



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ఎంఈఓ నాగయ్య

భూత్పూర్: విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని ఎంఈఓ నాగయ్య అన్నారు. గురువారం పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో ఎస్‌జీఎఫ్ మండలస్థాయి క్రీడా పోటీలను ప్రారంభించారు. ముందుగా క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. 14–17 ఏళ్ల వయసు గల క్రీడాకారులు 200 మంది కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ పోటీల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. ఆయా పోటీల్లో ప్రతిభకనబర్చి జిల్లాస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులను ఎంఈఓ అభినందించారు. విద్యార్థులు క్రీడల్లోనూ రాణించి.. పాఠశాల, గ్రామానికి పేరు ప్రతిష్టలు తీసుకురావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో హెచ్ఎం ఆనందమ్మ, ఎస్‌జీఎఫ్ క్రీడల ఇన్‌చార్జి కె.రమేష్ బాబు, గజానంద్ కుమార్, వ్యాయామ ఉపాధ్యాయులు వైశాలి, నిరంజన్, రవిచందర్, మధుబాబు, రాజేశ్వర్‌రెడ్డి, సీఆర్పీ విక్రమ్ పాల్గొన్నారు.

